క్లుప్తంగా

పుస్తక పఠనంతో విజ్ఞానం



విద్యార్థులతో పుస్తక పఠనం చేస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్లు

వెంకటగిరి రూరల్ : పుస్తక పఠనంతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. జ్ఞానాన్వేషణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వెంకటగిరి పట్టణం తూర్పువీధిలో ఉన్న గ్రంథాలయంలో శ్రీరామకృష్ణ పాఠశాల విద్యార్థులతో స్వీయ పఠన నైపుణ్యాల పెంపుదలపై పుస్తక పఠనం చేయించారు. ఈ ఎంఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మస్తాన్, శంకర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రాపూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం మాదాల మల్టీ స్పెషల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 300 మందికి పైగా వైద్య సేవలు పొందారు. నిర్వాహకులు మాదాల వెంకట తరణ్ మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయాలన్న ఉద్దేశంతో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కంటి వైద్యులు ప్రశాంత్, చెవి, ముక్కు వైద్య నిపుణులు పెంచలయ్య, జనరల్ మెడిసిన్ సునీల్ కుమార్ వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు అందజేసినట్టు వెల్లడించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని 14వ వార్డులో ఉన్న నరసింహారావు, పుల్లయ్యవీధి, కాశీపేట వద్ద ఉన్న మురుగు కాలువల్లో ఆదివారం పూడికతీత పనులు చేశారు. వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య మాట్లాడుతూ త్వరలో వెంకటగిరి శక్తిస్వరూపిని పోలేరమ్మతల్లి జాతర జరగనుందని తెలిపారు. ఈ క్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపి పట్టణంలో పారిశుద్ధ్య పనులు పూర్తిస్థాయిలో చేయించాలని కోరారు.

ఇసుక లారీలు స్వాధీనం



రాపూరు: మండలంలోని మద్రిపాడు వైపు నుంచి చెన్నై నగరానికి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీలను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మాల్యాద్రి తెలిపారు. జాతీయ రహదారిలో రాపూరు సమీపంలోని మద్దెల మడుగు వద్ద 3 భారీ లారీలను తనిఖీ చేశామన్నారు. ఇసుక ఉన్నట్లు గుర్తించి అనుమతి పత్రాలు చూపించాలని కోరినట్టు తెలిపారు. వాటికి అనుమతులు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామని వివరించారు. కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



కోట: కోటకు చెందిన శ్రీషిరిడీ సాయి అక్షయ సేవా సమితి 14వ వార్షికోత్సవాన్ని ఆదివారం కోటమ్మ ఆలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన 22 మంది విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతి అందజేశారు. మహిళలకు మూడు కుట్టు మిషన్లు, ఇద్దరు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. విద్యారంగంలో విశేష సేవలందించిన ఐదుగురు విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించారు. సాయితత్వ ప్రచారకులు కర్లపూడి కిష్టయ్య మాట్లాడుతూ శ్రీషిరిడీ సాయి అక్షయ సేవా సమితి చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. సిరిడీ సాయి సంకల్పాన్ని ఆచరణలో చూపిస్తున్న సంస్థ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య, ఆవుల సుబ్బయ్య, వాకాడు ఎంఈవో నజీం ఆలీ, ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్ మోహన్ రెడ్డి, గిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 6.066 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 6.066 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్య సాయిగంగ కాలువకు 120, లోలెవల్ కాలువకు 28 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సైదాపురం: మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు



చిల్లకూరు: మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు



ఉపాధ్యాయుల కొరతతో మూతపడిన సూళ్లూరుపేట మండలం దామరాయి పంచాయతీ చెరువుమిట్ట ప్రాథమిక పాఠశాల



- సరిగ్గా అమలుకాని భోజనం మెనూ
- మధ్యాహ్న భోజనంలో తగ్గిన నాణ్యత
- తప్పని ఉపాధ్యాయుల కొరత
- ప్రభుత్వ పాఠశాలలపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ

ఏకోపాధ్యాయులే దిక్కు

సైదాపురం/వెంకటగిరి రూరల్/చిల్లకూరు/సూళ్లూరుపేట : విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు అవుతోంది. ఇప్పటికీ చాలా పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు అందలేదు. గతంలో మెనూ ప్రకారం రాగిజావ, చిక్కీలు, రోజుకు ఒక్కొక్క రకం భోజనం వడ్డించేలా చర్యలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం అందులో మార్పులు తీసుకువచ్చింది. ప్రస్తుతం అది అమలుకాలేదు. బియ్యంలో నాణ్యత తగ్గింది. కోడి గుడ్ల సైజు తగ్గింది. సరిగ్గా ఉడకకపోవడం, చిమిడిపోయిన అన్నం వడ్డిస్తుండడంతో చాలా మంది విద్యార్థులు పాఠశాలల్లో భోజనం చేయడానికి ఇష్ట పడడంలేదు. ఇళ్ల నుంచి క్యారేజీ తెచ్చుకుంటున్నారు. ఇటీవల గూడూరు రూరల్ పరిధిలోని చవటపాళెం పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగా లేదని పిల్లల తల్లిదండ్రులు కూటమి నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. వారి సమాచారం మేరకు ఎంఈవో తనిఖీ చేసి మధ్యాహ్న భోజన నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చారు. నాయుడుపేట గురుకుల పాఠశాలలో ఇటీవల కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల సుమారు 100 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్న భోజనంపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. ఏకోపాధ్యాయులతో నడుస్తుండడంతో కొన్ని సార్లు స్కూళ్లు మూతపడుతున్నాయి.



సైదాపురం మండలం ఆర్‌వైజీ పాళెం పాఠశాల విద్యార్థులకు బోధన అందిస్తున్న పాఠాలు చెబుతున్న డిప్యుటేషన్‌పై వచ్చిన టీచర్

వెంకటగిరి నియోజకవర్గంలో మొత్తం 406 పాఠశాలలు ఉన్నాయి. సుమారు 30 వేలమందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వారికి సంఖ్యకు తగినట్టు ఉపాధ్యాయులు లేరు. వెంకటగిరి మండలంలోని మనులాలపేట, కళవలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. మనులాలపేటకు శుక్రవారం ఉపాధ్యాయుడిని అడ్జెస్ట్‌మెంట్ కింద నియమించారు. సైదాపురం మండలం తొకలపూడి పాఠశాలలో 24 మంది విద్యార్థులు ఉండగా ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. ఆర్‌వైజీ గ్రామంలో ఈ ఏడాది నుంచి ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభమైంది. రాపూరు మండలంలో 21 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. కలువాయి మండలం బద్దవోలు ప్రాథమికోన్నత, వీఆర్‌ఆర్‌పేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంది.

సూళ్లూరుపేట నియోజకవర్గంలో సుమారు వందమంది ఉపాధ్యాయులు కొరత వుంది. తడ, సూళ్లూరుపేట, దొరవారి సత్రం మండలాల్లోని తీరప్రాంత గ్రామాలైన ఇరకం, వేనాడు, కొరిడి, కొల్లపట్టు, దామరాయ, వేలికాడు, కారికాడు, నాగినేరి లాంటి తీర ప్రాంత గ్రామాలకు ఉపాధ్యాయులు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఈ స్కూళ్లు ఎప్పుడు వుంటాయో ఎప్పుడు వుండవో తెలియని పరిస్థితులు ఏర్పడ్డాయి. గత ప్రభుత్వం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక, పౌష్టికాహారం వంటి పథకాలతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే వారి సంఖ్య సుమారు 32 వేల మందికి పైగా ఉండగా ఈ ఏడాది 25 వేల మందికి పడిపోయింది.

గూడూరు నియోజకవర్గం			
మండలం	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య	టీచర్ల కొరత
గూడూరు, పట్టణం, రూరల్	112	7250	-
చిల్లకూరు	79	7568	-
కోట	72	7200	-
వాకాడు	76	3,600	-
చిట్టమూరు	62	3,800	-
వెంకటగిరి నియోజకవర్గం			
వెంకటగిరి	93	8,000	35
బాలాయపల్లి	72	5,750	27
డక్కిలి	70	4,259	23
రాపూరు	78	4,474	24
సైదాపురం	89	4,250	22
కలువాయి	66		21
సూళ్లూరుపేట నియోజవకర్గం			
సూళ్లూరుపేట	71	4912	16
పెళ్లకూరు	65	3664	26
నాయుడుపేట	78	6088	10
ఓజిలి	65	5611	-
తడ	49	3677	18
దొరవారిసత్రం	63	1458	25

రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించండి



మా గ్రామంలోని పాఠశాలను గతంలో మూసివేశారు. మార్చిలో పునః ప్రారంభించేందుకు అనుమతులు మంజూరుచేశారు. ప్రస్తుతం 20 మందికి పైగానే విద్యార్థులు చదువుతున్నారు. డిప్యుటేషన్‌పై ఒక ఉపాధ్యాయుడిని నియమించారు. రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలి.

– జీ గీతాంజలి, సర్పంచ్ ఆర్‌వైజీ పాళెం, సైదాపురం

నాణ్యమైన భోజనం అందించాలి



కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి భోజనం పథకం మెనూ మారింది. అన్నం సరిగ్గా ఉడకడం లేదని పిల్లలు చెబుతున్నారు. కూరలు కూడా బాగుండడం లేదని అంటున్నారు. దీంతో కొంతమంది ఇంటి నుంచే క్యారేజీలు తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి నాణ్యమైన భోజనం అందించాలి.

– వి ప్రభాకర్‌రెడ్డి, సైదాపురం

బడి మానేసి వచ్చేశా



నేను ఏరూరులోని ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తగరతి వరకు చదువుకున్నా. 9వ తరగతిలో కోటలోని గురుకుల పాఠశాలలో చేరాను. అక్కడ భోజనం సరిగా లేదు. ఆ అన్నం నాకు పడడం లేదు. దీంతో మా తల్లిదండ్రుల ద్వారా బడి మానేసి వచ్చేశా. ప్రస్తుతం చింతవరంలో కాని, వరగలి హైస్కూల్‌లో కాని చేరాలనుకుంటున్నా.

– వివేక్, 9వ తరగతి, ఏరూరు, చిల్లకూరు మండలం

పేద పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టాలి



గతంలోలాగే మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారు. జూన్, జూలై నెలల్లో భోజన తయారీ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల కొంత నాణ్యత లోపించింది. ఇటీవల నాయుడుపేటలో విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనతో అధికారులు అన్ని స్కూళ్లనూ పరిశీలించారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజనం పర్వాలేదు.

– బి.కార్తీక్, 9వ తరగతి విద్యార్థి వాకాడు

టీచర్లు తక్కువగా ఉన్నారు



మాకు ఇద్దరు పిల్లలు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. గతంలో పాఠశాలలు ప్రారంభంలోనే అమ్మ ఒడి కింద రూ.15 వేలు ఇచ్చేవారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు అయినా డబ్బు వేయలేదు. మా పిల్లల పాఠశాలల్లో టీచర్లు తక్కువగా ఉన్నారు. మధ్యాహ్న భోజనం కూడా సరిగా లేదు.

– పిల్లా శైలజ, పెళ్లకూరు మండలం

మధ్యాహ్న భోజనం బాగానే ఉంది



మాకు ఇద్దరు పిల్లలు. ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారు. జగనన్న విద్యాకానుకను మాత్రం అలాగే ఇచ్చేశారు. మధ్యాహ్న భోజనం బాగానే ఉందని పిల్లలు చెబుతున్నారు. ఉపాధ్యాయుల కొరత ఉందంట. అయినప్పటికీ వున్న ఉపాధ్యాయులు పిల్లలకు చదువులు బాగానే చెబుతున్నారు.

– బండి ఉషారాణి, మన్నారుపోలూరు

యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు

చిల్లకూరు : మండలానికి చెందిన టీడీపీ నాయకులు గ్రావెల్‌ను యథేచ్ఛగా తవ్వి తరలిస్తున్నారు. ఈ విషయం తెలిసినా రెవెన్యూ, పోలీస్, గనులశాఖాధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని తిప్పగుంటపాళెం సమీపంలో పెద్ద తిప్ప ఉంది. తిప్పలో కావల్సినంత గ్రావెల్ ఉన్నప్పటికీ గతంలో ఇక్కడ స్థానికుల అవసరాల నిమిత్తం మాత్రమే తవ్వకాలు చేసుకునేవారు. నేడు అధికార పార్టీకి చెందిన వారు ఆదివారం అయిందంటే చాలు ఇష్టానుసారం యంత్రాలను వినియోగించి గ్రావెల్‌ను తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. ఇప్పటికే తిప్పలో ఒక ప్రాంతంలోని గ్రావెల్ కనుమరుగు అయ్యిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రావెల్ తవ్వకాలపై అన్ని శాఖల అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.



తిప్ప వద్ద అక్రమంగా తవ్వుతున్న గ్రావెల్

అనుమతులు లేకుండా గ్రావెల్ తరలింపు

గూడూరు రూరల్ : గూడూరు రూరల్ పరిధిలోని పలు లేఅవుట్లకు రియల్టర్లు గూడూరు చెరువు నుంచి అనుమతి లేకుండా ఇష్టానుసారంగా గ్రావెల్‌ను తవ్వి తరలిస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము ఇళ్లముందు వేసుకోవడానికి ఒక ట్రాక్టర్ మట్టి తరలిస్తే పట్టుకునే అధికారులు రియల్టర్లపై చర్యలు తీసుకోకపోవడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గ్రావెల్‌ను తరలిస్తున్న ట్రాక్టర్లు

రసవత్తరంగా క్రికెట్ పోటీలు

చిల్లకూరు : తీర ప్రాంతంలోని మోమిడి క్రీడా మైదానంలో ఎనిమిది రోజులుగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. ఆదివారం మొత్తం 3 మ్యాచ్‌లు జరగ్గా తొలి మ్యాచ్ కొత్త పట్టణం, జిందాల్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేపట్టిన కొత్త పట్టణం జట్టు ఆరు వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన జిందాల్ జట్టు 5 వికెట్లు నష్టపోయి 96 పరుగులు చేసి విజయం సాధించింది. అనంతరం జరిగిన మ్యాచ్‌లో చింతవరం, గోపాలపురం జట్లు తలపడగా తొలుత బ్యాటింగ్ చేపట్టిన చింతవరం జట్టు 8.4 ఓవర్లలో 38 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన గోపాలపురం జట్టు 3.2 ఓవర్లలోనే 39 పరుగులు చేసి విజయం సాధించింది. మూడవ మ్యాచ్‌లో మోమిడి, కావలిపాళెం జట్లు తలపడగా తొలుత బ్యాటింగ్ చేపట్టిన మోమిడి జట్టు 7 వికెట్ల నష్టానికి 78 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన కావలిపాళెం జట్టు 9 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసి విజయం సాధించింది.



క్రికెట్ పోటీలో తలపడిన క్రీడాకారులు

విశ్రాంత ఉపాధ్యాయుడికి సన్మానం

కోట: యూటీఎఫ్‌లో కీలక బాధ్యతలు చేపట్టి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు ఈదూరు వేణుగోపాల్‌ను ఆదివారం కోటలోని అల్లారెడ్డి శ్యాంసుందరరెడ్డి భవన్‌లో ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం ముఖ్య అతిథిగా పాల్గొని వేణుగోపాల్ దంపతులను సత్కరించారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నుంచి యూటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై వేణుగోపాల్ సేవలను కొనియాడారు. యూటీఎఫ్ నేతలు బాబురెడ్డి, ఎస్ఎస్ నాయుడు, మనోహర్, భాస్కర్, నిర్మల, ముత్యాలరెడ్డి పాల్గొన్నారు.



ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

చిల్లకూరు:తూర్పుకనుపూరులో ఉన్న ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జామున సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు త్రిశూలం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. వారికి ఇబ్బంది కలుగకుండా ఆలయ ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, ఈవో నవీన్‌కుమార్ చర్యలు తీసుకున్నారు.

వైద్య వీరరాఘవులు ఆలయంలో..

నాయుడుపేట టౌన్: మండలంలోని చలివేంద్ర గ్రామ సమీపంలో ఉన్న వైద్య వీరరాఘవుల స్వామి (శ్రీదేవి, భూదేవి సమేత పెరుమాళ్) ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా ఆలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో ఆలయ నిర్వాహకులు ఆలం అమ్మణ్ణమ్మ, ఉభయ దాతలు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు



గాయపడిన కృష్ణయ్య, తేజావతి, శశిధర్

దొరవారిసత్రం : దొరవారిసత్రం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం రెండు బైక్‌లు ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న కృష్ణయ్య తన భార్య తేజావతితో కలిసి బైక్‌లో నాయుడుపేట నుంచి చందన ముడి బయలుదేరారు. దొరవారిసత్రం సమీపంలో ఎదురుగా రాంగ్ రూట్‌లో వేగంగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. దీంతో దంపతులతోపాటు రాంగ్ రూట్‌లో బైక్‌పై వచ్చిన శశిధర్ గాయపడ్డారు. వారిని స్థానికులు ఆటోలో డీసీసత్రం పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నాయుడుపేటకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటగిరి తహసీల్దార్‌గా మునిలక్ష్మి



వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి తహసీల్దార్‌గా ఐ.మునిలక్ష్మిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆమె గూడూరు డివిజన్‌లోని పలు మండలాల్లో తహసీల్దార్‌గా పనిచేశారు. ఆమె నిజాయితీగా విధులను నిర్వహిస్తారనే పేరు ఉంది. గతంలో వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం, డక్కిలి మండలాల్లో కూడా పనిచేశారు.

నేరాల నియంత్రణలో కఠినంగా ఉండాలి

గూడూరు రూరల్ : నేరాలను నియంత్రించేందుకు కఠినంగా వ్యవహరించాలని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి సూచించారు. ఆయన ఆదివారం గూడూరు పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గూడూరు పట్టణం, రూరల్, చిల్లకూరు మండలాల్లోని పోలీసులకు పరేడ్ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని అరుంధతివాడలో కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పట్టణం విస్తరిస్తున్న నేపథ్యంలో కొత్త వ్యక్తులు చొరబడి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉందని వివరించారు. గంజాయి, గుట్కా, హాన్స్ తదితర మత్తు పదార్థాలను విక్రయించి యువతను పక్కదారి పట్టించే ప్రమాదం ఉందన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డల నడవడికలపై దృష్టి పెట్టాలని సూచించారు. పోలీసులు అనుమానం ఉన్న ప్రతి ఒక్కరినీ ప్రశ్నించాలన్నారు. గంజాయి విక్రయాలు జరుగుతున్నట్టు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అరుంధతివాడ వాసులను కోరారు.



పోలీసులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

మీతిమీరుతున్న మందుబాబుల ఆగడాలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలో మందుబాబుల అగడాలు మీతిమీరుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మద్యం సేవించి అక్కడే బాటిళ్లను పడేస్తున్నారు. దీనిపై ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడుతున్నారు. మూడు రోజుల క్రితం జైహింద్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో మందు బాబులు మద్యం సేవిస్తుండగా ఆయా అడ్డుకుంది. దీంతో ముగ్గురు యువకులు తమనే అడ్డుకుంటావా అంటూ విచక్షణా రహితంగా దాడి చేశారు. అదే విధంగా జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ప్రతి రోజూ మందు బాబులు బహిరంగంగా మద్యం సేవిస్తూ అటుగా వచ్చే విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. దీనిపై ఉపాధ్యాయుడు ఇటీవల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అర్ధ రాత్రి సమయంలో కొంతమంది యువకులు ఉపాధ్యాయుడి ఇంటికి వెళ్లి తమపై పోలీసులకు ఫిర్యాదు చేస్తావా.. నీ అంతు చూస్తామంటూ హెచ్చరించినట్టు ఆ ఉపాధ్యాయుడు వాపోయారు. పట్టణంలో సాయంత్రం ఆరు గంటలు దాటిన తర్వాత జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంతో పాటు ఏఎల్‌సీఎం మైదానం, సీఎస్ తేజ సెంటర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం, ఎస్‌వీటీ థియేటర్ సమీపంలో గూడూరు రఘునాథరెడ్డి దుకాణాల సముదాయం ముందు, స్వర్ణముఖి నది శివాలయం సమీపంలో, బీఎంఆర్ నగర్ ఆవరణలో, గోమతి సెంటర్ సమీపంలో చదలవాడ కృష్ణమూర్తి వెంచర్ వద్ద, ఇంకా పలు బహిరంగ ప్రదేశాల్లో మందుబాబుల ఆగడాలు శృతిమించుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పోలీసులు స్పందించి తనిఖీలు చేసి బహిరంగంగా మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సీఎస్ తేజ సెంటర్ సమీపంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న మందుబాబులు

నాయుడుపేటలో కుండపోత వర్షం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలో ఆదివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్రంగా ఎండకాసింది. ఉక్కపోతతో ప్రజలు అల్లాడారు. సాయంత్రం ఉన్నట్టుండి వాతావరణంలో మార్పులు సంభవించి వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వర్షపు నీటితో మురుగు కాలువలు పొంగి ప్రధాన రహదారులపై ప్రవహించాయి. పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన రాజగోపాలపురం, గరిడీ వీధి, అమరా గార్డెన్, మోహన్‌బాబు తోట వీధి తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. మున్సిపల్ సిబ్బంది వర్షపు నీటిని తొలగించే పనులు చేపట్టారు.



పిల్లారిగుడి వీధిలో నిలిచిపోయిన వర్షపు నీరు

డీవీ సత్రంలో..

దొరవారిసత్రం : మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. నిన్నమొన్నటి వరకు దుక్కులు దున్ని వర్షం కోసం ఎదురు చూసే రైతులకు ఈ వాన ఊరటిచ్చింది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వరి నాట్లు, ఎలిది సాగు చేస్తున్నారు.